# విశ్వజ్ఞానయజ్ఞం – 2021

# మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

## విశ్వజ్ఞానయజ్ఞం - బృందావన యోగులు మొదటి రోజు (7/3/2021)




శివాయ గురవే నమః   శ్రీమాత్రేనమః   శ్రీవిష్ణురూపాయ నమఃశివాయ

శ్రీకృష్ణ:శరణంమమ      శ్రీరాధాకృష్ణాభ్యాం నమః



కృష్ణాతీరేకోకిలా కేళికీరే గుంజాపుంజే దేవపుష్పాదికుంజే

కమ్బుగ్రీవౌ క్షిప్తబాహూచరంతౌ రాధాకృష్ణౌమంగళం మే భవేతాం

ప్రీతిరివ మూర్తిమతి రససింధోస్సారసంపదివవిమలా

వైదగ్ధీనాం హృదయం కాచన బృందావనాధికారిణి జయతి

బృందావనం అనగానే గుర్తుకు వచ్చేది రాధాకృష్ణులు! అంటే అక్కడ ఉపాసించిన యోగులు వీరినే ఉపాసించారని తెలుస్తున్నది. బృందావన యోగుల చరిత్రలు చాలా ఉన్నాయి! చారిత్రకంగా

రాధాకృష్ణయోగుల చరిత్రలు లభిస్తున్నాయి! కొన్ని వందల మంది కనపడుతున్నారు! ఇప్పటికి వేలమంది సాధనాలు చేస్తూనే ఉన్నారు! బృందావన యోగులని స్మరించడం చేత రాధాకృష్ణుల కృప లభిస్తుంది! భగవంతుడు భాగవతప్రియుడు!

రాధాకృష్ణ భక్తులు బృందావనంలోనే ఉన్నారా? అంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు! అయినప్పటికీ ధ్యాన రూపంగా బృందావనాన్ని తలంచుతూ ఉంటారు! అలా భావించేవారు కూడా బృందావన యోగులే! అయితే, రాధాకృష్ణ భక్తులు బృందావనం వెళ్లాలని తహతహలాడుతారు! క్షేత్రాన్ని ఆశ్రయించి సిద్ధి పొందే మహాత్ములు ఎందరో ఉంటారు! క్షేత్రము యొక్క ప్రత్యేకత క్షేత్ర దేవతయే కాక, యోగుల తపశ్శక్తి అక్కడ కేంద్రీకృతం అయి ఉంటుంది, అందుచేత వారి కృపతో ఆ యా క్షేత్రాల్లో సాధన చేసినప్పుడు సిద్ధి లభిస్తుంది! ఆ యోగులు ప్రాపంచిక విషయాలన్నింటిని తృణీకరించి పరమాత్మయే ప్రధానంగా క్షేత్రాన్ని ఆశ్రయించుకుని ఉంటారు! అటువంటి ధీరులైన యోగులని స్మరిస్తే మన మనస్సు కూడా బృందావనంలో తాదాత్మ్యం చెందుతుంది.

**బృందావన మాహాత్మ్యం - రాధాదేవి తత్త్వం**

**బృందావన మాహాత్మ్యం** అనేక పురాణాల్లో ఉన్నది. వ్యాసప్రోక్తమైన అనేక పురాణాల్లో లభిస్తున్నది, విశేషించి స్కాంద పురాణం, దేవీ భాగవతం, పద్మపురాణం, బ్రహ్మవైవర్త పురాణం ఇత్యాదుల్లో విస్తారంగా వర్ణించారు. మధుర మండలం అంతా వివిధ వనాలతో కూడి ఉంటుంది. మధుర గోలోకము యొక్క స్వరూపం. వైకుంఠంలో ఏ విష్ణువైతే చతుర్భుజుడై ఉంటాడో ఆయనే కృష్ణరూపంలో గోలోకంలో ద్విభుజుడై ఉంటారు! ఆ కృష్ణతత్త్వం సృష్టికి అతీతము అయినది, సృష్టి అంతా వ్యాపించినది అయినటువంటి పరతత్త్వమే! నాద ఆనంద స్వరూపుడై కేవలం సచ్చిదానంద తత్త్వముగా గోలోకంలో భాసిస్తూ ఉంటే ఆయన యొక్క అవిభాజ్యమైనటువంటి ఆహ్లాదిని శక్తి అమ్మవారు రాధా దేవి! రాధాదేవి - కృష్ణుని అంతరంగభూతా (రాధికోపనిషత్తు)! ఋగ్వేదీయమైన మంత్రరాశి గోచరిస్తున్నది రాధికోపనిషత్తు అని, అధర్వవేదీయమైన గోపాలతాపనీయోపనిషత్తు, రాధికాతాపనీయోపనిషత్తు వీటిల్లో రాధికాతత్త్వము, విశేషములు ఉన్నాయి. ఇలా అనేక పురాణాల్లో రాధికా తత్త్వం చెప్పబడుతున్నది! భాగవతంలో రాధమ్మ గూఢ నాయిక! అగోచరంగా! మనిషికి ప్రాణం ఎలాగో అలా!

దక్షిణాదిలో రాధాదేవి తత్త్వం అంతగా తెలియదు! కొన్ని ప్రాంతాల్లో కొన్ని ఉపాసనలు ఉంటాయి కదా! క్షేత్రానికి సమీపంలో ఉన్నవారికి ఆ తత్త్వం తెలిసినట్లుగా క్షేత్రానికి దూరంగా ఉన్నవారికి తెలియదు! ఉదాహరణకి తమిళనాట ఉన్న స్కంద ఉపాసన ఉత్తరాదిలో తెలియదు! కొన్ని ప్రాంతాల్లో కొన్ని ఉపాసనలు ఉంటాయి!

రాధాదేవి తత్త్వం బృందావనం ప్రాంతంలో ఎక్కువగా తెలుసు! రాధా నామస్మరణయే వారికి ప్రాణంగా జీవిస్తారు! బృందావనం ప్రవేశిస్తే రాధే రాధే అనే నామం తప్ప కనపడదు! సాహిత్య దృష్టి పక్కన పెట్టి సచ్చిత్ దృష్టితో పరిశీలిస్తే బృందావనం మొత్తం రాధాతత్త్వం పరచుకుని ఉంటుంది. ఆ తల్లికి కృష్ణపరమాత్మయే బృందావనాధికారిణిగా పట్టాభిషేకం చేసినట్లు గర్గభాగవతంలో, బ్రహ్మసంహితలో, ఇతర పురాణములయందు చెప్పబడుతున్నది. పూర్ణతత్త్వానికి సంకేతంగా పౌర్ణమాసీ దేవి రాధాదేవి పట్టాభిషేక ఏర్పాట్లు చేసిందట! సాక్షాత్తు బ్రహ్మదేవుడు మంత్రాలు చదువుతూ ఉండగా కృష్ణపరమాత్మ పట్టాభిషేకం చేసారు!

బృందావనం వెళ్లినవారికి తెలుస్తుంది రాధాతత్త్వం! లౌకిక విషయవాసన ఏ మాత్రం ఉన్నా కూడా రాధాకృష్ణుల అసలు తత్త్వం అర్థం కాదు! శుద్ధమైన అంతఃకరణం ఉన్నవారికే రాధాకృష్ణ తత్త్వం అర్థం అవుతుంది. ఆ శుద్ధ అంతఃకరణం తెచ్చుకోవడానికి రకరకాల సాధనలు చేయాలి. రాధాకృష్ణతత్త్వం అర్థం అయితే అంతకంటే పరిపూర్ణత్వం మరొక చోట లేదని తెలుస్తుంది! అలా తెలుసుకున్నవారే బృందావనయోగులు! వారు రసయోగులు!

బృందావనం రసధామం. రసమంటే రాధా, రాధయే రసం! ఆ రాధారస భూమికాయే బృందావనం. బృందావనం ఆశ్రయించి రసానుభవం పొందుతున్న యోగులు రసయోగులు! వాళ్ళు నిజమైన రసికులు! రసం అంటే బ్రహ్మానుభూతి అని చెప్పింది ఉపషన్మాత! ఆనందం కలిగించే ఒక తాదాత్మ్యానుభూతిని రసం అనాలి! బ్రహ్మానందమే రసము అని తెలుసుకోవాలి! రసో వై సః! ఏ రసాన్ని అనుభవిస్తే ఆనందం పొందుతామో అదే రసము/ బ్రహ్మము! ఆ సమంతాత్ హ్లాదము. రసము = ఆనందం = హ్లాదిని. ఆ కేవల ఆనంద శక్తి, హ్లాదిని శక్తి రాధాదేవి!

పరమాత్మకు మూడు శక్తులు: సంధిని, సంవిత్, హ్లాదిని శక్తి! రాధా అనేది ఒక చరిత్రలో పాత్ర కాదు, ఒక వ్యక్తి కాదు! అది తెలుసుకోవాలి! చరిత్రలో రాముడు,చరిత్రలో కృష్ణుడు అంటూ భగవానుడిని చారిత్రక దృష్టితో చూడడం మానివేయాలి! చరిత్రకంటే ముందున్నవారు రామకృష్ణాదులు! చరిత్రకు

భగవంతుడు దొరకడు. చరిత్రలో పాత్రలు కాదు వీరు! వేదప్రతిపాద్యమైన వారు! సంహితా గ్రంథాల్లో ఎంతో చెప్పబడుతున్నది!

**బృందావనం - రాధాకృష్ణయుగళం**

రాధాకృష్ణులను వేరుగా చూడరాదు! పద్మపురాణంలో కృష్ణపరమాత్మ చెప్తారు, నన్ను రాధను వేరుగా చూస్తే వాళ్ళు కాలసూత్రం అనే నరకంలో పడతారు అని! ఇక్కడ నరకంలో పడిపోతారేమో అనుకోవడం కాదు! వేరుగా చూడరాదు అని తెలుసుకోవాలి!

భారతీయ సంస్కృతిలో మిథున ఉపాసన విశేషం - శక్తి సహిత బ్రహ్మ ఉపాసన.

పరమేశ్వరుని కేవల ఆనంద శక్తి, **అనుభూతి రూపమైనటువంటిది**, అదే రసము, అదే బ్రహ్మానందం! విషయానుభుతి భ్రాంత్యానందం, భగవదనుభూతి బ్రహ్మానందం. భగవదనుభూతి యొక్క రూపమే రాధాదేవి! రాధాదేవి వ్యక్తి కాదు! అనుభూతికి రూపం ఉంటుందా? అమ్మవారు సాకార నిరాకారా కూడా! కృష్ణపరమాత్మ కూడా అంతేకదా! అయితే రూపం ధరిస్తుంది భక్తులని అనుగ్రహించడానికి! అనుభూతిని ఇవ్వడానికి సాకారులై యోగులని అనుగ్రహిస్తున్నారు, నిరాకారులై ఆనందానుభూతి ప్రసాదిస్తున్నారు. ఉపాసనలు చేసినవారికి తెలుస్తుంది. ఆ ఉపాసన యంత్రాలు, మంత్రాలు, తంత్రాలతో కూడినది కాదు! ఆ విశేషమే వేరు! కేవలం భావనా ప్రధానమైన ఒక అద్భుత అనుభవ స్వరూపం. వాసనలన్నీ విడిచిపెడితే కానీ రాధాకృష్ణతత్త్వం అందదు! ***భావం - అనుభవం ఈ రెండిటి యొక్క భూమికయే బృందావనం!***

**యోగుల కథలు ఎందుకు? సాధన ఎలా ఉంటుంది, సిద్ధి అంటే ఏమిటో గ్రహించడానికి, ఆ రెండిటి మీద విశ్వాసం ఏర్పడి మనం సాధనలో ప్రవేశించి సిద్ధి పొందడానికి!**

**రసము**

స్వచ్ఛమైన ఆనందం, హ్లాదిని శక్తి!

చంద్రుడి నుండి వెన్నెల ఎలా అవిభాజ్యమో అలా రాధాకృష్ణులు! చంద్రుని వెన్నెల మనదాకా వస్తున్నది, అలాగే కృష్ణచంద్రుని యొక్క కారుణ్యం మనదాకా రావాలి కదా! అది అనుగ్రహం!

స్వామి కారుణ్యం మనవరకు రావాలి కదా!

**సాధనలతో ముక్తి పొందలేము, భగవదనుఅనుగ్రహంతో మాత్రమే పొందగలము! అనుగ్రహం కోసం ఏడవడమే మన పని! సాధనతో పొందుతాను అంటే అహం ప్రవేశించినట్లు! అనుగ్రహానికి అహానికి చాలా దూరం!**

కృష్ణ కరుణ రసమే అమ్మవారు రాధాదేవి!

భగవంతుడు అనుగ్రహించాలి అంటే ఆయనకు కృప కలగాలి! అది కలగాలి అంటే మనకి భగవంతునిపై ప్రేమ కలగాలి!

**రాధాదేవి ప్రేమస్వరూపిణి!**

"ప్రేమ ప్రియ" ఇవి ఉపనిషత్ జనితముల్లైన పదములు! ఇక్కడ ప్రియం అంటే అస్తి, భాతి, ప్రియము లోని ప్రియము! అంటే ఆనందం!

ప్రియం = ఆనందం

ఈ ప్రేమ తెలియాలి అంటే ప్రేమ ఉండాలి!

బృందావన యోగులు ప్రియతమాప్రియతములు అంటారు రాధాకృష్ణులని! ప్రేమాస్వరూపులు వాళ్లిద్దరూ!

**"ప్రీతిరివ మూర్తిమతి రససింధోస్సారసంపదివవిమలా**

**వైదగ్ధీనాం హృదయం కాచన బృందావనాధికారిణి జయతి"** అంటారు హితహరివంశీ.

భగవంతుని ప్రేమ కరుణ/ఆనందం అనే రూపంతో ఉంటే, అది పొందాలి అంటే మనలో ఆ ప్రేమ భక్తి రూపంలో ఉండాలి.

ప్రేమ ప్రపంచంవైపు ప్రవహిస్తూ ఉంటె అది అధో దశ. ధారగా కురుస్తున్న భగవంతుని ప్రేమని అందుకోవాలంటే మన ప్రేమ ప్రపంచ విషయాల నుండి పరమాత్మవైపు తిరగాలి. ధార తిరగబడాలి పరమాత్మవైపు! **పరమాత్మకి అభిముఖంగా ప్రసరించే చిత్తవృత్తి పేరే రాధా! రాధాదేవి ఏ కాలంలో ఉంది? ఏ పురాణంలో ఏ సాహిత్యంలో ఉంది? ఇవి కాదు! నీలో ఉండాలి రాధా! భక్తి రుచి తెలిసినవాడికి రాధమ్మ అంటే ఏమిటో తెలుస్తుంది!** రాధమ్మ కృప లేనిదే కృష్ణుడు దొరకడు అంటే భక్తి లేనిదే భగవంతుడు దొరకడు అని!

అనన్యముగా, సంపూర్ణంగా పరమాత్మవైపే ప్రేమ అనుసంధానింప బడాలి!

యోగపరంగా - క్రిందకి ప్రసరించే కుండలిని సహస్రారంవైపు ప్రసరిస్తే ఆ కుండలినియే రాధాదేవి!

జ్ఞానపరంగా - లోకచింతన విడిచి బ్రహ్మచింతన చేస్తున్నప్పుడు ఆ చింతన రూపమైన ధార బ్రహ్మముతో అనుసంధానం చేస్తున్నది కనుక తద్రూపమైన బ్రహ్మవిచారణ కూడా రాధయే!

**ప్రీతి భగవత్పరమైనప్పుడు రాధా! భగవంతుని ప్రీతి మనవైపు ధారగా కురిస్తే అది కూడా రాధా!**

చంద్రుడి వెన్నెల మనమీద పడుతూ ఉన్నప్పుడు ఆ వెన్నలని బట్టి చంద్రుని చూస్తున్నాము! అలా భగవంతుడు మనమీద కురిపిస్తున్న కరుణని బట్టి ఆయన్ని చూస్తున్నాము! కనుక భగవంతునికి మనమీద కరుణరూపమైన ప్రేమ మనలో భక్తి రూపమైన ప్రేమ, ఈ రెండూ ఒకటిగా కలిపి చూస్తే రాధాదేవి!

రాధాదేవి అంటే ఒకానొక వ్యక్తి కాదు! పరమాత్మకు అవిభాజ్యమైన హ్లాదిని శక్తి!

భక్తి భూమిగా మారితే దానిపేరు బృందావనం!

అక్కడ అందరు రాధే రాధే అంటూ ప్రపంచాన్ని మరచిపోతారు! అందుకు ముందర అక్కడికి వెళితే కాస్త అయినా భక్తి తగులుతుంది!

అగాధమైనది రాధాకృష్ణతత్త్వం! అంత తేలికగా అర్ధమవ్వదు!

భగవంతుని శక్తులయిన లక్ష్మి, దుర్గ, సరస్వతి, గాయత్రీ ఇవన్నీ లోకాన్ని నడపడానికి అయితే, కానీ హ్లాదినీశక్తి అయినటువంటి రాధాదేవి కేవల ఆనందరూపం అయినా స్వరూపము! తురీయ భూమికకు చెందినది! శుద్ధమైన ఆనందస్వరూపం! కృష్ణుడు బ్రహ్మము అయితే, రాధాదేవి ఆనందము!

తాను బృందావనం ప్రవేశించకముందర కూడా కృష్ణపరమాత్మ ఉన్నాడు! ఆయన తత్త్వం అక్కడ ఉన్నది! గోకులంలో అందరిని అక్కడికి ప్రవేశింపచేసినది రాధాదేవి! వారందరికీ కృష్ణానుభవం ఇప్పించిన తల్లి రాధాదేవి! అదే కేవల అనుభవ స్వరూపం , అది ఆ తల్లి! రాసము అనే అనుభవాన్ని అనుగ్రహించే తల్లియే రాసేశ్వరి! అది ఆయనయొక్క అనుగ్రహమైన లీల, రాసలీల! నిత్యరాసములోకి ప్రవేశం కోసమే యోగులు సాధన చేస్తారు! నిత్య భగవదనుభవమే నిత్యరాసలీల అంటే! ఆ ప్రవేశం కలిపించేది రాధాదేవి!

రాసలీల కృష్ణావతారాన్ని మునుపే ఉన్నది, ఎప్పుడు ఉంటుంది. రాధాదేవి కూడా కృష్ణపరమాత్మ అవతరించినప్పుడు అవతరించింది! బర్సానా అనే గోకులంలో అవతరించింది, వృషభానుడు అనే గోపరాజు సుతగా! స్వయంభూ మూర్తిగా ఆవిర్భవించింది. కృష్ణపరమాత్మ ఆవిర్భవించిన తరువాత తల్లి ఆవిర్భవించింది. రాధాకృష్ణుల విహారం రహస్యమైన అంశము! గోపికల ఎవ్వరి పేర్లూ భాగవతంలో చెప్పలేదు! కానీ అమ్మ రాధాదేవి నాయికగా ఉన్నది!

బృందావనంలో గడ్డిపరక మొదలు గోపికల వరకూ కృష్ణావతారంలో కృష్ణుని వల్ల ముక్తిని పొందారు! భగవద్ రసానుభవం సిద్ధించే చోటు బృందావనం!
స్వామికి అక్కడ నాదమే, ఆయుధం లేదు! వేణువుతో ఆయన సమ్మోహింప చేసారు! ఏ జీవులు తనలో ప్రవేశింపడానికి యోగ్యులో వారికి వేణువుతో నాదానుసంధానం అనుగ్రహించారు!
నాదానుసంధానం, రసానుభూతి ఇచ్చిన తల్లి స్వామియొక్క నాదశక్తి, ఆనందశక్తి అయిన రాధాదేవి.
బృందావనం విడిచిపెట్టి ఒక అడుగు కూడా వేయను అన్నారట స్వామి! స్థూలంగా వెళ్లినట్లు కనపడ్డాడు కానీ సూక్ష్మంగా జ్యోతిస్వరూపంగా ఉండిపోయాడు! ఇప్పటికి రాధాకృష్ణుల నిత్యలీలలు జరుగుతూనే ఉంటాయి! యోగ్యులైన వారికి వారి భావనాబలం బట్టి కృష్ణానుభూతి పొందే భావం అమ్మవారిస్తారుట అది ఏమిటంటే మహాభావము! రాధాదేవి మహాభావస్వరూపిణి! అది ఆవిర్భవిస్తే కానీ కృష్ణానుభవం రాదు!
మహాభావ/ప్రేమ/హ్లాదిని/రస స్వరూపిణి ఈ తల్లి!
ఆవిడ బృందావనంలో మాత్రమే లభిస్తుంది!
బ్రహ్మదేవుడు 6000 సంవత్సరాలు తపస్సు చేస్తే కాలిగోటి దర్శనం మాత్రమే అయిందట అప్పుడు ఆయన ఏడ్చాడు! అప్పుడు స్వామి కృష్ణపరమాత్మ బృందావనంలో మా ఇద్దరి అనుగ్రహం దొరుకుతుందిలే అన్నారు, ఆ తర్వాత బ్రహ్మదేవుడు అనుగ్రహం పొందాడు!

బృందావనానికి దూరంగా ఉన్నా, బృందావనాన్ని చింతన చేసి కృష్ణయ్య సాయుజ్యం పొందినవారు ఉన్నారు! అందులో ఒకరు నారాయణతీర్థులు!

రాధాకృష్ణుల మధ్య ప్రేమ భౌతికమైనది కాదు! అలౌకికము! ధర్మాధర్మములకు అతీతం! కేవలం బ్రహ్మానుభూతికి సంబంధించినది! కాముడి గర్వం అణిగితేనే రాసలీల! ప్రపంచ కామాన్ని గడ్డిపోచలా వదిలివేసిన యోగులు మాత్రమే అందుకునే భగవదానుభూతికి ఆలవాలమే బృందావనం!
ఆనందం కలిగించేదాన్ని వనం అంటారు! భక్తబృందావనమునకు ఆనందం కలిగించే చోటు, భక్తబృందమును రక్షించు చోటు! ఇది తెలిస్తే భావనలో బృందావనం అందుకోగలము!
బృహదారణ్యక ఉపనిషత్తు తత్త్వమే బృందావనం అంటారు నారాయణతీర్థులు! బృందావనంలో కేవలం ఆనందం, అనుగ్రహం, మోక్షం అంతే!

తెలుగువారిలో - నారాయణతీర్థులు, లీలాశుకులు (బిల్వమంగళుడు)
లీలాశుకులు ఎప్పుడూ బృందావన కృష్ణపరమాత్మనే ధ్యానిస్తూ ఉంటారు!
ఉపనిషత్తులు ప్రతిపాదించే పరమాత్మయే బృందావనంలో తిరుగుతూ ఉన్నారు అంటారు లీలాశుకులు! ఆయన బృందావనంలోనే ముక్తి పొందారు! ఇప్పటికి ఆ చోటు చూడవచ్చు!
కరపాత్రి స్వామిజి కాశీ క్షేత్రంలో కేదార తీర్థంలో రాధాకృష్ణుల అనుగ్రహం పొందారు!
అలాగే అఖండానంద సరస్వతీ మహారాజ్ కూడా! వీరంతా అద్వైత నిష్ఠులు కృష్ణానుభూతిని పొందారు! అద్వైత సిద్ధిలో పొందే బ్రహ్మానుభవమే కృష్ణానుభవం అని ఈ యోగులు చెప్పారు!

***ప్రజసాహిత్యం***

ప్రణామవల్లరి - రాధాబాబా
ప్రేమసరితా - ధృవ్ దాస్
వ్రజ్ కి రసికాచర్యా - వ్రజంలో సిద్ధి పొందినవారి చరిత్రలు
వ్రజ్ నవభక్త్ మాలా - 206 మంది యోగుల చరిత్రలు
కృష్ణ సిద్ధాంత సార్
సిద్ధాంత రత్నాకరం
రాధా రహస్య స్వరూపం

1961 లో పాట్నాలో "భారతీయ వాంజ్మయమే శ్రీరాధా" అని సెమినార్ జరిగిందట, అక్కడ రాధాతత్త్వంపై 523 పుటల గ్రంథం వెలువరించారు, వివిధ ఉపనిషతుల్లో, వేదాల్లో, తంత్రశాస్త్రాల్లో ఏ విధంగా రాధాదేవి తత్త్వం చెప్పబడిందో ఉంటుంది. అందులో యోగుల చరిత్రలు చాలా ఉన్నాయి!

## మొదటి యోగి - హరిదాస్ జి

1537 వ సంవత్సరంలో భాద్రపద శుద్ధ అష్టమి నాడు ఒక యోగి జన్మించారు! రాధా దేవి జన్మతిథి ఇదే!

వీరి పూర్వీకులది పంజాబ్! ఈయన ఆలీఘుట్ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న గ్రామంలో జన్మించారు! ఈయన పేరు హరిదాస్ జి! ఈయన 25 సంవత్సరాల వరకు ఇంట్లోనే బ్రహ్మచర్య దీక్షలో ఉన్నారు! జన్మతః రాధాకృష్ణ భక్తులు! 25వ సంవత్సరంలో ఆయన వివాహం జరిగాక భార్య కొద్దికాలానికే మరణించింది. ఆ తర్వాత ఆయన తన గురువైన ఆసుధీర్ జి దగ్గర సన్యాస దీక్ష తీస్కుని బృందావనం చేరారు! ఆ తర్వాత ఆ క్షేత్రం దాటలేదు! ఇది క్షేత్ర దీక్ష!

కృష్ణ సాధనలో రసోపాసన అనే విధానం ఉన్నది! అక్కడ ఉన్నది కేవలం భావన మాత్రమే! ఇది అంతఃకరణంలో భగవంతుడు ఇచ్చిన శక్తి! భావన, విచారణ అని రెండు శక్తులు ఉంటాయి అంతఃకరణానికి!

బ్రహ్మ విచారణ చేస్తే జ్ఞానం

బ్రహ్మ భావన చేస్తే భక్తి

శాస్త్రము ద్వారా గురువు చెప్పిన మార్గంలో తనకు పరమాత్మ మీద ఉన్న ప్రేమని ఆ మార్గం ద్వారా శుద్ధం చేస్కుని పూర్ణం చేసుకోవాలి! పూర్వజన్మ సుకృతం వల్ల ప్రేమ కలిగినా అనేక రకాల విషయవాసనలు అంటుకోవడం వల్ల అడ్డుకుంటున్నాయి! అప్పుడు గురువును ఆశ్రయించి పూర్ణం చేసుకోవాలి!

***బృందావన యోగంలో ప్రధానంగా ఉండవలసిన నిష్ఠలు: 1) నామ నిష్ఠ 2) ధామ నిష్ఠ 3) స్నాన నిష్ఠ 4) సత్సంగ నిష్ఠ 5) భావ నిష్ఠ***

***నామ నిష్ఠ: గురువు దగ్గర మంత్రం తీస్కుని శ్రద్ధగా అనుష్ఠించడం***

*ధామ నిష్ఠ: బృందావనమే ప్రధానం అని ఆశ్రయించుకుని ఉండడం*

*స్నా న నిష్ఠ: రాధాకృష్ణులు విహరించిన, విహరిస్తున్న చోట్లలో స్నా నమాచరించడం*

*సత్సంగ నిష్ఠ: రసయోగులతో సత్సంగ నిష్ఠ ప్రధానం శ్రద్ధ బలపడడానికి!*

*భావ నిష్ఠ: యోగ్యతని పట్టి గురువులు పరీక్షలు పెట్టి ఇస్తూ ఉంటారు! విషయ వైరాగ్యాన్ని బట్టి ఇస్తారు.*

అష్టకాలీన లీలా స్మరణ అని ఒక ప్రక్రియలో రోజుని ఎనిమిది భాగాలుగా చేసి రాధాకృష్ణ లీలలని స్మరిస్తారుట! ఇది అడిగారట ఒకాయన గురువు వద్దకు వెళ్లి! నీలో విషయవాంఛలు మరణిస్తేనే ఇస్తాను అన్నారుట! ఎన్నో రోజులు పరీక్షించి అప్పుడు ఇస్తారు! భక్తి భావానికి ఒక పద్ధతి, నియమం ఉన్నది!

అలా ఈ హరిదాస్ జి శ్యామాశ్యాములను స్మరిస్తూ రమణీయమైన నిధివనంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారట! కృష్ణపరమాత్మ నిత్యలీలా ధామముల్లో నిధివనం ఒకటి! ఆయన అక్కడ నిరంతర రాధాకృష్ణ భావంతో ఉండేవారు హరిదాస్ జి! మంచి సంగీత విద్వాంసుడు! ఆ నాదవిద్యతో రాధాకృష్ణ ఉపాసన చేస్తూ ఉండేవారు! ఆయనకి భావసమాధిలో వారు దర్శనం ఇచ్చేవారుట! ఆయన గానం చేసిన గ్రంథములో కేళిమాల అనే గ్రంథం ఉన్నది.
ఒకచోటుని నమస్కరించి అనేవారుట కొన్నాళ్ళకి అద్భుతం జరుగుతుంది అని అనేవారట! అలాగే ఒకనాడు ఆయన ధ్యానసమాధిలో ఉండగా మార్గశీర్ష శుద్ధ పంచమి నాడు తెల్లవారుఝామున భూమి నుండి తనంత తాను ఒక అద్భుత విగ్రహం బయట పడిందిట! ఇది రాధాకృష్ణయుగళ రూపం! అభేదం చెప్తున్నది! దుఃఖ ఛాయలు కూడా లేని నిత్యానుబంధం కలిగిన యుగళము రాధాకృష్ణ యుగళం! అది ప్రకటింపబడి హరిదాస్ జి ఒళ్ళోకి వచ్చినది! అప్పుడు బృందావన ప్రాంతాల్లో నుండి, చుట్టుపక్కన ప్రాంతాల్లో నుండి ఎందరో తరలివచ్చారు! మూడురోజుల పాటు ఆ విగ్రహంలో శ్వాస కూడా గమనించారు! అటు తర్వాత వైశాఖ శుద్ధ తదియ నాడు ప్రతిష్ఠింప పడింది, అదే బాంకీ బిహారి (వన్ కి విహారి) అని ఇప్పటికి బృందావనంలో ప్రధాన మందిరం!

మహాభక్తుడి తపస్సు చేతనే పరమాత్మ స్వయంభువు గా వ్యక్తం అవుతారు. క్షేత్రం అనగానే దేవత స్థలం మాత్రమే కాకుండా దేవతని సాక్షాత్కరింప చేసుకుని మన కోసం నిలపెట్టిన మహాత్ములలో ఈయన ఒకరు!

హరిదాస్ జి సంప్రదాయంలో నేటికీ ఎంతోమంది తరిస్తున్నారు!

బాంకీ బిహారి (వన్ కి విహారి) ఈయన లీలలు అన్నీ ఇన్నీ కావు! భక్తవాత్సల్య మూర్తి! హరిదాస్ జి తనని కొలుచుకుంటూ ఉన్న తన తమ్ముడు జగన్నాథ్ జి కి విహార్ జి సేవలని అప్పగించారు! ఆయన తన ప్రాణం కన్నా ఎక్కువగా సేవించుకున్నారు!

హరిదాస్ జి సంగీత నైపుణ్యం అంతా ఇంతా కాదు! సా సంగీతంలో బృందావన పరిమళం ఉంటుంది, రాధాకృష్ణ అలౌకిక అనుభూతి ఉంటుంది! అప్పుడు పాలకుడిగా ఉన్న అక్బర్ ఈయన సంగీతం వినాలని అనుకున్నాడట! తన ఆస్థాన సంగీత విద్వాంసుడు అయినటువంటి తాన్సేన్ ని అడిగాడట మీ గురువుగారి పాట వినాలి అని! నువ్వు పిలిస్తే వచ్చి పాడరు ఆయన వద్దకు వెళ్లి వినాలి అన్నారుట తాన్సేన్!
అలా వీరిద్దరూ వెళ్లారుట హరిదాస్ జి వద్దకు! ఒకనాడు ఆయన పాటకి తన్మయులయ్యే అవకాశం వచ్చింది. అది విన్నాక కళ్ళనీళ్ళతో ఆయన కాళ్ళమీద పడ్డాడట అక్బర్! మీకు ఏదో విధంగా సేవ చేయాలి అని అడిగాడట! ఆ అడగడంలో అహంకారం కనిపిచ్చింది హరిదాస్ జి కి! అందుకు అక్కడ కుండం వద్ద ఒక ఇటుక ఊడిపోయింది వెళ్లి పెట్టు అన్నారుట! ఈయన వెళ్లి చూసేటప్పుటికి అద్భుత రత్నాలు కన్పడ్డాయిట ఒక్కొక్క మెట్టులో! దెబ్బకి అతడి అహంకారం అణిగింది.

*బృందావనంలో మూడు భూమికలు ఉంటాయి 1) భౌమ 2) సూక్ష్మ 3) భావ భూమిక రసోపాసకులకి తల్లి రాధాదేవి అనుగ్రహించేది భావభూమిక! అది అసలు బృందావనం! అప్పుడు తెలుస్తుంది బృందావన అనుభవం! మనం చూడకపోయినా సూక్ష్మ, భావ భూమికలు ఉన్నాయని తెలుసుకుని తిరగాలి! క్షేత్రానికి యాత్రికులుగా కాదు, సాధన కోసం వెళ్ళాలి!*

*మనకి అర్హత అయినా ఉన్నదా? పరదోష విమర్శలతో తిరిగేవారికి బృందావనం ఎక్కడ అనుభవానికి వస్తుంది? శుద్ధత ఏది? సాధనలో ఒక భూమికకు వెళితే సూక్ష్మ బృందావనం చూడవచ్చు, ఇంకా పండితే భావభూమిక చూడవచ్చు!*

సిద్ధపురుషులు నిత్యతృప్తులు వారిని ఎవరూ తృప్తిపరచలేరు! అలా అక్బర్ బుద్ధి వచ్చి ఆయన కాళ్ళమీద పడ్డాడు!
ఆ తర్వాత తాన్సేన్ కూడా రాజాస్థానము వదిలివేసి హరిదాస్ జి ని సేవిస్తూ అక్కడే తరించిపోయాడు! అసలైన సంగీతం ఏంటో తెలుసుకున్నాడు!

ఉత్తరాదిలో ఎన్నో రాష్ట్రాల్లో బాగా వ్యాపించి ఉన్నారు. ఎందుకో కానీ తెలుగునాట అంతగా తెలియదు తల్లి రాధాదేవి తత్త్వం. రాధికా ప్రసాద్ జి మహారాజ్ జి అనే ఆయన తెలుగువారిలో ఒకాయన ఉన్నారు! ఆయన కూడా రాధాకృష్ణ భక్తిలో తరించినవారు.

*పూజ్య గురువుల తండ్రిగారి ద్వారా వారికి చిన్ననాడే రాధాతత్త్వం, బృందావనం గురించి తెలిసిందని అని పేర్కొన్నారు. పూజ్య గురువుల తండ్రిగారు బ్రహ్మవైవర్త పురాణాన్ని తెలుగులో రచిస్తూ రాధాదేవి గురించి ఇలా అంటారు:*

*"అంతానంత సురూపమ్ములతో అలరునదే రాధ*
*స్వాంతస్థయునై సైయ్యమివరులకు సత్య సుఖద రాధ!*
*కృష్ణ ప్రియ శ్రీ కృష్ణ హృదంతర కృష్ణ కృష్ణ రాధ!*
*కృష్ణా రాధానతత్పర సతతాత్ కృష్ణ కృష్ణ రాధ!*
*నిలువని నడువని లలిశయనింపని నిర్గుణ నిష్క్రియుని*
*చలితునియెట్టుల దోపగ చేయును స్వాత్మ శక్తి విభుని"*

*గీతా ప్రెస్ నుండి హనుమాన్ పోద్దార్ మహానుభావుడు మొదలైన వారు అందరూ కలిసి "రాధామాధవ చింతనం" గ్రంథంలో తీసుకువచ్చిన రాధాతత్త్వం ఎంతో ఉన్నది! అది పరిశీలించారు గురుదేవులు. అలాగే వ్రజసాహిత్యం ఎంతో పరిశీలించారు, పఠించారు. ఎన్నో మార్లు భాగవతం, రాసలీల,*

*వేణుగీతం, కృష్ణకర్ణామృతం ఇలా అనేక విషయాలు అక్కడ ప్రవిచించినప్పుడు కృష్ణనుగ్రహానికి పరవశిస్తూ, ఆ యా భూమికలో విహరిస్తూ వ్రజసాహిత్యం ఎంతో చదివారు!*

ఒకప్పుడు పంజాబ్ నుండి ఒక కోటీశ్వరుడు హరిదాస్ జి ని చూడడానికి వచ్చాడు! ఈయన కృష్ణభక్తుడట! (అనేకమంది సిద్ధపురుషులకు కృష్ణ ఉపాసన మొదలుపెట్టాక అనేక మహిమలు వచ్చాయట! కొంతమంది యువకులు అవి ప్రకటించేసేవారట! కానీ గురువులు చెప్పేవారట అలా ప్రకటించరాదు! అని! కానీ కొన్ని మార్లు ఆర్తులని ఉద్ధరించడానికి మహిమలని బయటపెడతారు).
(బృందావనంలో ప్రతీ ఇల్లు ఒక కృష్ణమందిరం! తమతో పాటు స్వామి ఉంటాడు).
బృందావనంలో హోళీ ఉత్సవం అద్భుతంగా జరుగుతుందిట! ఆ సమయంలో ఈ పంజాబ్ కోటీశ్వరుడు ప్రత్యేక పరిమళం సమర్పించుకున్నాడుట. హరిదాస్ జి ఒక నవ్వు నవ్వి ఆ పొదల్లో పడేసారుట! కోటీశ్వరుడు కాస్త బాధపడ్డాడట! ఆ తర్వాత బాంకీ బిహార్ ఆలయం వద్దకు వెళ్ళేటప్పటికి అక్కడ యోగులు కొందరు తాదాత్మ్యంతో భావసమాధిలో రాధాకృష్ణులు ఒకరిపై ఒకరు అత్తరు జల్లుకుంటూ ఉండే సన్నివేశాన్ని చెప్తూ ఉన్నప్పుడు తెలిసిందిట ఈ కోటీశ్వరుడు ఇచ్చిన అత్తరు ఆ పొదల్లో విసిరినట్లు కనిపించింది కానీ అదియే రాధమ్మ చేతికి వచ్చి కృష్ణపరమాత్మపై వేసినది అని తెలుసుకుని, తిరిగి గురువులను దర్శించుకుని ధన్యుడయ్యాను అనుకున్నాడుట!

హరిదాస్ జి రచనలు అనేకం చేసారు! రసోపాసనలో సిద్ధిపొందిన ఆయన వద్దకు దయోపాస్ అనే విప్రుడు వెళ్ళాడు! యితడు ఒక యక్షుని ఉపాసన చేసినవాడట! (ఇది ఆదర్శం, పరిపూర్ణం కాదు). ఆ యక్షుడు పరశువేది ఇచ్చాడుట ఇతడికి! పన్నెండేళ్ళు తర్వాత దీని మహిమ పోతుంది అని చెప్పాడట యక్షుడు. ఆ విప్రుడు దానితో చాలా ధనం పొంది, ఆ పరశువేదిని ఎవరైనా మహాత్ములకి ఇవ్వవలసినది అని, అప్పుడు హరిదాస్ జి కి

110 పదములు అనే గీతములతో కేళిమాల, అలాగే సిద్ధాంత పథ్ అనే గ్రంథం కూడా రచించారు! ఇది సాధనకు అత్యంత ముఖ్యం!
హరిదాస్ జి సంప్రదాయం, నింబార్క సంప్రదాయం, గోస్వామి సంప్రదాయం ఇలా అనేక సంప్రదాయాలు, వాటికి సంబంధించిన అనేక వాంఙ్మయం కూడా ఉన్నది!

హరిదాస్ జి ని రాధాదేవి అష్టసఖుల్లో లలితాదేవి అనే ఆవిడ అవతారం అని చెప్పబడుతున్నారు. (అష్టసఖులు: లలితా, విశాఖ, చిత్ర, ఇందురేఖ, చంపకలత, రంగదేవి, తుంగవిద్య, సుదేవి) అదేంటి ఈయన పురుషుడు కదా, స్త్రీ కాదు కదా! అంటే మనం మాత్రం స్త్రీలమా? పురుషులమా? శాస్త్రం మనకి హెచ్చరిస్తున్నది స్త్రీవి కాదు, పురుషుడివి కాదు తెలుసుకో అని ఎప్పుడు తెలుసుకుంటామో ఏమిటో!

స్త్రీ పుం అతీత తత్త్వం హ్లాదిని అని తెలుసుకోవాలి!

ఒకమారు హరిదాస్ జి చిన్నప్పుడు శివాభిషేకానికి వెళ్ళినప్పుడు శివుడు అన్నాడుట స్వప్నములో కనపడి ఈ పిల్లవాడితో నాకు అభిషేకం చేయించకండి, యితడు నాకు గురువు అని!

అది ఎలా అంటే,

ఒకమారు శివునికి రాసలీలలోకి ప్రవేశించాలని అనిపించిందిట.

గోపీభావం పొందితేనే రాసలీలలోకి వెళ్ళగలరు! గోపి భావం అంటే రసానుభూతికి యోగ్యమైన స్థితి! రసానుభూతి అంటే ఇంద్రియములు కానీ, ఇంద్రియములను అంటిపెట్టుకున్న అంతఃకరణం కానీ ఇంక ప్రపంచ విషయాలవైపు వెళ్లకుండా పరమాత్మ మాత్రమే అనుకుని ఉండే స్థితి!

శివుడు అలా ప్రవేశించలేక పోయినప్పుడు కృష్ణపరమాత్మ సైగ చేస్తే లలితాదేవి వెళ్లి మంత్రోపదేశం చేసిందిట, ఆ  మంత్రంతో ఆయన గోపిభావం పొంది రాసలీలలో ప్రవేశించి కృష్ణానుభవం పొందారుట, పొందుతూనే ఉన్నారు గోపేశ్వర మహారాజ్ గా అక్కడే ఉంటూ!

ఎంత తపించినా కొందరు బృందావనం వెళ్ళలేరు, కొందరు ఏ తపస్సులూ లేకుండానే అక్కడికి వెళ్లి స్థిరపడిపోతారు.

**<u>హరిదాస్ జి సంప్రదాయంలో పరంపరగా వస్తున్న దానిలో కొద్దికాలం క్రితం జరిగిన ఘట్టం:</u>**

శ్రీకృష్ణచంద్ర గోస్వామి జి అనే ఒక మహానుభావుడు బాంకీ బిహారి మందిరంలో సేవకుడిగా ఉన్న ఒక మంచి పండితుడు. ఆయన తాను చూసిన ఒక అనుభవాన్ని వ్యాసంగా రచించాడు!

బృందావనం ఎన్ని లీలల భూమియో! ఒకనాడు రాత్రి ఆయన కృష్ణజపం చేస్కుని తెల్లవారు ఝామున నాలుగింటికి యమునానదిలో స్నానం చేయడానికి హర్గులాల్ హవేలీ అనే స్నానఘట్టానికి వెళ్ళారుట. అక్కడ ఈయనకి ఒక సాధు పుంగవుడు కనపడ్డాడుట ఒక పాట పాడుకుంటూ:

*జయ జయ శ్యామా జయ జయ శ్యామ్*

*జయ జయ శ్రీ బృందావన ధామ్*

*జయ జయ శ్రీస్వామి హరిదాస్*

*జయ జయ నిధివన్ నిత్యవిలాస్*

ఆ సాధువు ఎలా ఉన్నాడంటే ఒక కౌపీనం, తులసిమాల ధరించి ఉన్నాడు, గడ్డము, జడలు కట్టి ఉన్నాయి. ఈ శ్రీకృష్ణచంద్ర గోస్వామి జి కూడా ఆయన్ని చూసి జై హరిదాస్ అన్నారుట, ఆయన కూడా జై హరిదాస్ అని అక్కడ నుండి వెళ్లిపోయారు. మరు రోజు స్నానం చేసినప్పుడు కూడా కనపడ్డాడుట. అలాగే బృందావన పరిక్రమ చేస్తున్నపుడు కనపడ్డాడుట అప్పుడు ఈయన దగ్గరగా వెళ్లారుట స్నానం చేసినప్పుడు కనపడ్డాయన కదా అని, అప్పుడు ఆ సాధువు అన్నారుట ఒక సహాయం చేస్తావా అని, ఏమిటి అంటే, ఎవరో నాకు కొత్త వస్త్రాన్ని ఇచ్చారు నేను కొత్తవి ధరించను, నువ్వు వాడిన పాతవస్త్రం ఇస్తే లంగోటికి కట్టుకుంటాను కానీ నాకు ఇవి అక్కర్లేదు అన్నారట!
శ్రీకృష్ణచంద్ర గోస్వామి ఈయన దగ్గర నుండి ఎన్నో విషయాలను తెలుసుకోవాలని మీరు ఎక్కడుంటారు అని అడిగారట, ఆయన ఎక్కడేమిటి బృందావనంలో అన్నారట!
శ్రీకృష్ణచంద్ర గోస్వామి అడిగారట బృందావనంలో ఏ ఆశ్రమంలో ఏ మఠంలో అని, బృందావనమంతా నాకు ఆశ్రమమే అన్నారట ఆ యోగి! నాకు ఎప్పుడు ఆకలి వేస్తె అప్పుడు మధుకరానికి వెళతాను ఎవరు ఏది ఇస్తే అది తింటాను, నిద్ర వచ్చినప్పుడు ఏ చెట్టు కింద అయినా పడుకుంటాను, దాహము వేస్తె యమునమ్మ తల్లి ఉందిగా, నాకు నిత్యపుష్టికి రాధాకృష్ణస్మరణ! అన్నారట!
పలుమార్లు ఈయన తారసపడ్డాక శ్రీకృష్ణచంద్ర గోస్వామి ఆ సాధువుని అడిగారట మీ గురించి నాకు చెప్తారా అని! ఆ యోగి అన్నారుట, నేనేమీ దాచుకోనయ్యా అని ఒక మర్రిచెట్టు కింద కూర్చోపెట్టి మొత్తం కథను చెప్పారు!

ఆ యోగి కలకత్తా సమీపంలో జన్మించారు, తల్లితండ్రులు మరణించడంతో పెంచిన ఆవిడ తన కొడుకు దగ్గర ఉంటూ ఈయన్ని కూడా సాకేది! ఆయనకు చదువుకుంటున్న రోజుల్లో హిమాలయాలు, ఆ యోగులు అవి వింటూ అక్కడికెళ్లాలని కుతూహలం కలిగేది! ఒక నాడు హిమాలయాలకు వెళ్లాలని కుతూహలంతో ట్రైన్ స్టేషన్ కి వచ్చి అక్కడ కూర్చున్నాడు! పక్కనే పదిసంవత్సరాల పిల్లవాడు కూర్చున్నాడుట! అప్పుడు ఇతను ఆ పిల్లవాడిని అడిగాడట, హరిద్వార్ వెళ్లే ట్రైన్ ఎప్పుడు వస్తుంది అని, ఆ పిల్లవాడు అన్నాడట నేను కూడా ఆ ట్రైన్ కోసమే చూస్తున్నాను, ఆ ట్రైన్ రాగానే చెప్తాన్లే నువ్వు విశ్రాంతి తీస్కో అని! అలా అతను విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, హఠాత్తుగా లేపి ఇదే ఇదే ఆ ట్రైన్ అని చెప్పి ఒక ట్రైన్ లో ఇద్దరు ఎక్కారు. ట్రైన్ ఎక్కాక అతడు ఆ పిల్లవాడితో అన్నాడుట ట్రైన్ ఎక్కేసాను కానీ నావద్ద టికెట్ లేదు, అధికారులు వచ్చి జైలు కు తీసుకెళితే ఎలా, నువ్వేం చేస్తావు అని అడిగాడు,  ఆ పిల్లవాడు అన్నాడుట "నీతో పాటే నేను" అని. ఇంకా ఇలా అన్నాడుట "నాక్కూడా టికెట్ లేదు లే! మనమంతా టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నవాళ్ళమే, ఎప్పుడో అధికారి వస్తాడు దింపేస్తాడు"! అతడికి ఏమర్థమయిందో కానీ ఏదో గొప్పగా మాట్లాడుతున్నాడు అనుకున్నాడట!

త్రోవలో ఆ పిల్లవాడికి ఇతడికి ఈవిధంగా సంభాషణ జరిగింది:
పిల్లవాడు: మీరు ఎక్కడికి వెళుతున్నారు?
"హిమాలయాలకు"

పిల్లవాడు: ఎందుకు?
"తపస్సు చేస్తాను"

పిల్లవాడు: తపస్సు ఎందుకు చేస్తావు?
"తపస్సు చేస్తే శక్తులు వచ్చి, వాటితో స్వర్గం, మోక్షం మొదలైనవి వస్తాయి. తపస్సుతో దీర్ఘాయువు, మహిమలు కూడా వస్తాయి"

పిల్లవాడు: జీవితంలో ఇందులో ఏది నీకు కావాలి?

అతడు సమాధానం చెప్పలేక ఆలోచనలో పడగా పిల్లవాడు అంటున్నాడు "చూసావా టికెట్ లేని ప్రయాణంలా ఉంది కదా నీది కూడా" అని.

మధ్యలో టికెట్ కలెక్టర్ వస్తూ ఉండగా ఇద్దరూ దిగిపోయారు! ఈ పెద్దాయన ఆకలి వేస్తోంది అంటూ ఉంటే చూద్దాం ఎవరైనా కనపడతేరేమో అన్నాడు పిల్లవాడు, ఇంతలో ఒక ముసలావిడ కనపడి రెండు రొట్టెలూ, బెల్లము ఇచ్చిందిట, కడుపు నింపుకున్నారు! ఈ పెద్దాయన ఆ ముసలావిడని అడిగాడు ఇక్కడికి ఎంత దూరంలో హరిద్వార్ అని! ఆవిడన్నది ఇక్కడికి దరిదాపుల్లో కూడా హరిద్వార్ లేదు! ఈ ట్రైన్ కూడా హరిద్వార్ కి సంబంధించినది కాదు! ఇక్కడికిదగ్గర్లో పవిత్రమైన వ్రజభూమి ఉన్నది! కృష్ణపరమాత్మ ఎక్కడ పుట్టి లీలలు చేసాడో, అది ఉన్నది అన్నది! అది విని పిల్లవాడిపై కోపంగా చూసాడుట, నిలదీసాడు!
పిల్లవాడు అన్నాడు "హిమాలయాల్లో ఎంత తిరిగినా దొరకని అమృతరసం ఇక్కడ సిద్ధిస్తుంది, అమృతరసం కోసం కొండలు ఎక్కాలి అనుకున్నావు, అమృతసాగరం వద్దకే తీసుకెళుతున్నాను అన్నాడు! అదే నీ గమ్యస్థానము, నువ్వు రావలసిన క్షేత్రానికే వచ్చావు! నువ్వు ఎక్కడికి చేరాలో అక్కడికి చేర్చడానికే నేను వచ్చాను" అన్నాడు! మాయావి మాట్లాడుతూ ఉంటే ఆయన ఎవరో తెలియనిస్తాడా?

మొత్తానికి అలా మాట్లాడుతూ చెయ్యి పట్టుకుని చిన్న రైల్వే స్టేషన్ కి తీసుకొచ్చాడు, అక్కడికి ట్రైన్ వచ్చింది, అది ఎక్కించి మధురలో దింపాడు, అక్కడ చిన్న ట్రాక్ వస్తే అక్కడ మరో ట్రైన్ ఎక్కించాడు! మధురలో ఈ పెద్దాయన మళ్ళీ ఆకలి అంటూ ఉంటే ఏదో ఏర్పాటు చేసాడు పిల్లవాడు పైగా అన్నాడుట "నీ ఆకలి ఇప్పటిది కాదు జన్మ జన్మల ఆకలి, అది తీరే సమయం వచ్చింది" అన్నాడు! మధురలో ట్రైన్ ఎక్కించి, నేను ఇక్కడ,ఉండిపోతాను నువ్వు ఈ ట్రైన్ ఎక్కి పడుకో, పొద్దున అయ్యేటప్పటికి వచ్చేదే నీ గమ్యస్థానము అని చెప్పాడట! ఆ ట్రైన్ బృందావనం చేర్చింది! అక్కడ జనవాహిని కనిపిస్తూ ఉన్నది!

అక్కడ ఒకాయన్ని అడిగాడట ఇక్కడ తినడానికి, తాగడానికి, వసతికి ఏమయినా ఉంటాయా అని! ఆ వృద్ధుడు అంటున్నాడు, "ఇది బృందావన ధామం, రాధారాణి రాజధాని, ఈ ధామంలో అందరికీ

తినడానికి, త్రాగడానికి నీరు, కట్టుకోవడానికి వస్త్రం, ఉండడానికి వసతి లభిస్తాయి, శాంతిని పుష్టిని అందచేయడానికి రాధాకృష్ణ నామం లభిస్తున్నది, యుగళకిశోరుల ప్రేమ లభిస్తుంది" అని చెప్పి తనతో మీర్జాపూర్ భవన్లో కిచిడీ ప్రసాదం పుచ్చుకోవడానికి తీసుకెళ్లారు! అక్కడ పెద్ద క్యూ ఉన్నది, ఈయన వద్ద పాత్ర కూడా లేదు ఆకలి నకనకలాడుతున్నది! ఆ క్యూలో మొట్టమొదటలో ఉన్న ఒక తొమ్మిదేళ్ల బాలిక ఈయన్ని చూసి ఇలా రా అని పిలిచిందిట, ఈయన వెళ్ళగానే ఆ అమ్మాయి అంటున్నది "రేపటి నుండి నే ఇష్టం వచ్చినట్లు నించో కానీ, ఇవాళ నా అతిథిగా స్వీకరిస్తున్నాను, ముందరకొచ్చి నిలబడాలి అన్నది, అందరూ కూడా అవకాశం ఇచ్చారు! పాత్ర లేదని చూసి తన పాత్ర నుండి పాత్ర కూడా తీసి ఇచ్చి, బృందావనంలో ఉన్నన్నాళ్ళు ఈ పాత్ర పోగొట్టుకోకు అన్నది! ఆ అమ్మాయి మాటలు, వాత్సల్యం చూసి అతడు అనుకుంటున్నాడు, చిన్నపిల్లే అయినా ఎంతటి ఔదార్యం, ఎంత మధురమైన వాక్కులు! అసలు ఆమెని చూస్తూ ఉంటేనే తెలియని ఆనందం కలుగుతున్నది అనుకున్నాడు. ఆయనకి ఆనందాశ్రువులు రాలుతున్నాయి! మనకి తెలియకుండానే అటువంటి సాత్త్విక భావోద్రేకం కలిగించే భూమి అది!
ఆ అమ్మాయి అందిట ఎందుకు ఏడుస్తున్నావు, బాధ పడకులే నిన్ను ఏ బాలకుడైతే ట్రైన్ ఎక్కించాడో అతడే ఇవ్వమన్నాడు ఈ పాత్ర అని కూడా అన్నది. పాత్రలో కిచిడి తిందామని బయటికి వచ్చాడు, పక్కకి తిరిగాడో లేదో ఆ అమ్మాయి ఇక కనపడలేదు!

ఇలా ఆ యోగి మర్రిచెట్టుకింద శ్రీకృష్ణచంద్రగోస్వామికి తన కథని చెప్పి, అప్పటినుండి ఆ తీసుకొచ్చిన పిల్లాడిని, పాత్ర ఇచ్చిన పిల్లని వెతుకుతూ తిరుగుతున్నానయ్యా నాకు కనపడడంలేదు! దశాబ్దాలయింది కనపడలేదు, వాళ్ళ పేర్లే అంటూ తిరుగుతున్నాను! ఏడుస్తూ ఏడుస్తూ ఇక్కడ ఒక మహాత్ముడిని అడిగాను! ఎప్పటికైనా వాళ్ళు అనుగ్రహిస్తారు కదా అన్నాను, అతడు "ఈ వెతకడమే నీ సాధన" అని చెప్పాడు! అప్పటినుండి ఇదే పని మీద తిరుగుతున్నాను అన్నాడు ఆ యోగి! వ్యాసం రాసిన ఆయన ఆఖరికి వ్రాసారు "మళ్ళీ నాకెప్పుడూ ఆ యోగి కనపడలేదు" అని!

సంకేతం: టికెట్ లేని ప్రయాణం గమ్యం లేని బ్రతుకు! ఎటు వెళుతున్నామో తెలియదు, తింటున్నాము, తిరుగుతున్నాము, ఛస్తాము! జీవితానికి పరమార్థమేమిటి అనే ఆలోచనే లేదు! కానీ కాలము/యముడు అనే టికెట్ కలెక్టర్ వస్తే దింపేస్తాడు. ఎక్కడ దిగుతామో తెలియదు!

నిత్యాన్వేషణ అనే అన్వేషణా రూపమైన అనుగ్రహం మనకి ఇందులో కనపడుతున్నది!

## హరిదాస్ జి సంప్రదాయంలో మరో యోగి - భగవాస్ దాస్

అనేక యోగభూముల్లో మరొక ప్రత్యేక భూమి తటియాస్థాన్. ఇక్కడ హరిదాస్ జి సంప్రదాయానికి చెందినవారు చాలామంది ఉంటారు.

ప్రసిద్ధి చెందగానే కుతూహలంతో వెళ్ళేవాళ్ళు చాలామంది కనపడతూ ఉంటారు. వారి కోసం దుకాణదారులు, దొంగలు, వంచకులూ అందరూ చేరతారు! మరి దీని మధ్యలో బృందావనం కనపడదా అంటే, సాధకులను బృందావనం ఎప్పుడూ నిరాశపరచదు!

తటియాస్థాన్ వద్ద ఒక మహానుభావుడు ఉండేవాడు! ఆయన తన 21వ ఏటనే (1944) బృందావనం చేరుకొని "మధురాదాస్" అనే ఆయనవద్ద దీక్షా స్వీకారం చేసారు. ఆయన భక్తిని చూసి గురువు ఆ స్థానానికి మహంత్ గా నియమించారు ఇతన్ని! మహంత్ గా ఉన్నా కూడా ఈయన దాసుడిగానే ప్రవర్తించేవారు. ఆనాటి పండితులు అయోలక్ రాయ్ శాస్త్రి, దులారి ప్రసాద్ జి, సుదర్శనాచార్య జి, హంసదాస్ బాబా వంటివారు ఈయన మాటలు వినేవారుట.

ఈయన మహంత్ గా ఉండేటప్పుడు కృష్ణపరమాత్మకు చేసే సేవలు చాలా విశేషంగా ఉండేవి! ఈయన కూడా స్థూల, సూక్ష్మ, భావ బృందావన ప్రస్తావన చేసేవారు.

బృందావనంలోకి ప్రవేశించాలంటే 1)వైరాగ్యం - ప్రపంచ విషయాలను త్యజించాలి 2) త్యాగం 3) ప్రేమ - భగవంతునిపై ప్రేమ ఉండాలి! ఈ మూడు పైన చెప్పిన అయిదు నిష్ఠలతో (నామ, ధామ, స్నాన, సత్సంగ, భావ నిష్ఠలు) కూడి ఉన్నవారే అర్హులు!

ఈయన తటియాస్థాన్ దాటి ఎప్పుడూ రాలేదు నియమం ప్రకారం. ఈయన బృందావనం యొక్క గొప్పతనాన్ని అనేకరకాలుగా ప్రకటించారు. ఒకప్పుడు 1981 లో బృందావనానికి వరద ప్రమాదం వచ్చింది. అప్పుడు యమునానది పొంగుతోంది! పోలీసులు వారందరు అక్కడ వారిని సురక్షిత ప్రాంతాలకి చేరుస్తూ ఈయనని కూడా రమన్నారు! ఇంతకంటే సురక్షిత ప్రాంతం లేదు, ఇది దాటి నేను, రాను యమున పొంగి నన్ను తీసుకెళితే అది కృష్ణేచ్ఛ! కృష్ణసంకల్పం తప్ప మరొకటి లేదు, కృష్ణ ప్రసాదం తప్ప మరొకటి లేదు! ఈ భావంతో బ్రతకాలి! ఆ భావనే ప్రధానం!

యమునానది తటియాస్థాన్ ని తాకలేదు ముంచలేదు!

ఒకసారి ఆ మహానుభావుడు దన దగ్గర ఉన్న బచ్చు లాల్ అనే శిష్యుడిని పిలిచి నువ్వు చాలా తప్పు చేసావు ఇవాళ అన్నారట! ఆ బచ్చు లాల్ అక్కడ తిరుగుతూ తిరుగుతూ అక్కడ ఉన్నటువంటి చెట్టు తీగ ఆకును తుంచాడట!

తటియాస్థాన్ లో చెట్ల వద్ద శుభ్రంగా ఉంచుతారు! బృందావనంలో ప్రతీ చెట్టు, ప్రతీ తీగ ప్రత్యేకం! అన్నీ నెలపైపు కొమ్మలు దింపుతాయి! బృందావనం మట్టిరసాన్ని ఆస్వాదించడానికా అన్నట్లు!

భగవాన్ దాస్ బచ్చు లాల్ తో అన్నారు నువ్వు నిన్న ఆ చెట్టుతీగను గిల్లావు! ఆ చెట్టురూపంలో సాధన చేస్కుంటున్న సాధువు వచ్చి "నీ శిష్యుడు నన్ను గిచ్చాడు చూడు" అని చెప్పాడు!

బృందావనంలో చెట్లు, లతలు అన్నీ కూడా సాధువులు! వారు ఆ రూపంలో అక్కడ తపస్సులు చేస్కుంటూ ఉంటారు! కదలకుండా ఉండే జన్మ కావాలని అనుకుంటారు వారు! అవి చెట్లే కదా! (ఇది అతిశయోక్తి కాదు, కృష్ణలీల అని గ్రహించగలగాలి)!

కృష్ణపరమాత్మ కదంబ వృక్షం మీద నుండి కాళేయునిపై దుమికేటప్పుడు మూలంలో అంటారు "కృష్ణస్పర్శ కోసం అనేకజన్మల తపస్సులు చేసి అక్కడ పుట్టిన కదంబ వృక్షంపై ఎక్కారు" అని!

బృందావనంలో చెట్టు, చేమ, గరికపోచ కూడా గొప్పవి! కృష్ణపాదస్పర్శ పొందినవి! గోపికల పాదస్పర్శ, బృందావనయోగుల పాదస్పర్శ పొందినవి! ప్రతీ బృందావన యోగి ఒక గోపిక! ఆ గోపికాభావం పొందడానికి సాధన చేస్తాడు, అది సిద్ధించాక కృష్ణానుభూతిని పొందుతాడు! ఆ భావమిచ్చినది, ఆ భావాన్ని పెంచి పోషించేది కృష్ణారసానుభూతిని ఇచ్చే ఆ రాధాదేవి అనుగ్రహం ఉండాలి.

మొత్తానికి బచ్చు లాల్ ఆశ్చర్యపోయి ఇకమీద అలా చేయననుకున్నాడు!

తటియాస్థాన్ లో ఎలక్ట్రిసిటీ వాడరు! అలాంటివి వస్తే అక్కడి పవిత్రతను దెబ్బతీస్తాయని రానివ్వరు! కృష్ణుని కాలంలో ఎలా ఉన్నదో అల్లాగే ఉంచడానికి ప్రయత్నిస్తారు!

ఇప్పటికి అక్కడి మట్టిని నుదుటిపై ధరించి, తెల్లటి వస్త్రాలు ధరించి, ఒక అనిర్వచనీయమైన సంగీతంతో రాధాకృష్ణుల సేవ చేస్తారు!

తటియాస్థాన్ కి ఒకమారు శుకదేవ్ అనే ఆయన వచ్చారట! భగవాన్ దాస్ తో అన్నారట ఏమిటి రాత్రి అయినా దీపాలు వెలిగించడంలేదే అని! నాయనా ఇది మణులు కనిపించడంలేదా అని,

బృందావనం దివ్యధామం! ఇది మృణ్మయం కాదు, చిన్మయం! ఇక్కడున్న ప్రకాశం దీపాలకు అందేది కాదు అన్నారట!

అయోధ్య నుండి రామసాహన్ అనే ఒకాయన భగవాన్ దాస్ జి దర్శనానికి వచ్చారుట! తటియాస్థాన్ లో అతిథిగా ఉంటూ ఒక మాట అడిగారు, శాస్త్రాల్లో చెప్పే బృందావనం, మనకంటికి కనిపిస్తున్న బృందావనం ఒకటేనా? అని! భగవాన్ దాస్ జి అన్నారు "నాయనా ఈ మట్టికళ్ళతో దివ్యబృందావనం గోచరించదు! దివ్యచక్షువులు వస్తే కానీ ఆ దివ్యత్వం కనపడదు అన్నారు! ఆ రాత్రికి భగవాన్ దాస్ జి అనుగ్రహం వల్ల బచ్చులాల్, రామసాహన్ వీరిద్దరికీ బృందావనం జ్యోతిర్మయంగా గోచరించింది. వృక్షాలు, తీగలు అన్నీ మణులతో ప్రకాశిస్తున్నాయి!
మరునాడు రామసాహన్, భగవాన్ దాస్ జి పాదాలపై పడి, ఈ దివ్యబృందావనంలో నాకు స్థానం దొరుకుతుందా అన్నాడుట! నాయనా! భక్తిని అనుసరించి స్థానాలు ఉంటాయి! నీ గమ్యం దివ్యబృందావనం కాదు దివ్యఅయోధ్యా! అయోధ్యలో ఉన్న దివ్యభూమిక రామయోగులకు తెలుస్తుంది!

**ఉపాసకులు/సాధకులు తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటి?**

***ఒకటి వినేటప్పుడు వెంటనే తాను చేస్తున్న ఉపాసన మానేసి ఇందులోకి వచ్చేద్దాము అనుకోవనక్కర్లేదు! ఈ వింటున్న వాటి ద్వారా తన ఉపాసనా మార్గాన్ని బాగా బలపరచుకోవాలి! రాధాకృష్ణుల గురించి వినగానే ఓహో రామభక్తికంటే కృష్ణభక్తి గొప్పదేమో అనుకోవడం, శివభక్తి, అమ్మవారి భక్తి గొప్పవి కావేమో అనుకోవడం అజ్ఞానం! ఇది గమనించి ఇందులో ఉన్న నిష్కపట రసభక్తి సిద్ధాంతాన్ని తన మార్గంలో తాను అవలంబించుకుంటే తాను ఉపాసించే దైవాన్ని ఈ భావముతో దర్శించుకోవచ్చు! వేదం ప్రతిపాదించే ఉపాస్యదైవాలన్నీ ఒకే పరతత్త్వ స్వరూపానివి అని మరువరాదు! ఇది తెలియక కొందరు ఒక దేవత గురించి చెప్పేటప్పుడు ఇతర దేవతలను తక్కువగా చూడడం అనే తప్పు చేస్తూ ఉంటారు! అంతేకాక ఏ దేవత గురించి చెప్తే ఆ దేవతే గొప్పదనిపించేటట్లు చెప్తారు ఇష్టదేవతని ఎలా ఎంచుకోవడం అని కొందరు అయోమయంలో పడతారు! ఇది అజ్ఞానంవల్ల కలిగేది!***

*అయోధ్యలో రామానుభూతిని పొందుతూ రామసాధన చేసే యోగులు నేటికీ ఉన్నారు! భారతదేశంలో ఇలాంటి దివ్యభూమికలు ఉన్న క్షేత్రాలు ఉన్నాయి! అవి సేవించకుండా బ్రతకడం కంటే దురదృష్టం మరొకటి లేదు!*

ఒకప్పుడు భగవాన్ దాస్ జి జపం చేస్కుంటూ ధ్యానంలో ఉన్నారట! ఒళ్ళంతా తడిసిపోయి స్నానం చేసి వస్తే ఎలా ఉంటుందో ఆలా ఉన్నారట! ఏమిటి ఈ విధంగా ఉన్నారంటే, ఇవాళ నా సాధనలో ధ్యానంలో ఉండగా, రాధాదేవి తన సఖులతో స్నానానికి వెళుతూ సఖీ భావంతో ఉపాసిస్తున్న నన్ను కూడా గోపీభావనతో స్నానానికి పిలిస్తే వెళ్లి యములో మునిగి వచ్చాను తడిసిపోయాను అన్నారుట! భావన వారిదయినప్పుడు ఇంకొకరికి ఎలా కనపడుతుంది అంటే భావన అవాస్తవము కాదు! భావయోగము తెలుసుకోవాలి! ఒక యోగి భావయోగంలో రాధాదేవి పాదము తన నుదుటికి తాకినటువంటి భావనాసమాధి సిద్ధించిన తరువాత ఆ తల్లిపాదాల పారాణి ఈయన నుదుటిమీద కనపడింది! చెరిపినా చేరగలేదు! ఆ యోగులు భావనలో పొందినది కేవలం భావనాజనిత వికారము కాదు! అదొక సత్యానుభవం! సత్యమైన భావము, సత్యమైన అనుభవం! ఈ రెండిటికి అనుబంధం తెలియాలి అంటే బృందావనం తెలియాలి!

<u>మహాభావము అంటే ఏమిటి? (శివుడు పార్వతీదేవితో చెప్తున్నారు)</u>

అందరికీ తెలిసినవి స్థూల, సూక్ష్మ, కరణ శరీరాలు! వీటిని ఇంకా విభాగం చేస్తే అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు!
అందరికీ తెలియని మరొక కోశము మహాభావకోశము! కృష్ణకృప వల్ల మాత్రమే ఈ దేహం వస్తుంది! శాస్త్రవాసనలు, తర్జన,భర్జనలు, ఇలాంటి అహంకారాలు వదిలిపెడితేనే రాసలీల అర్థమవుతుంది! పంచకోశములకు విలక్షణమైన కోశము అది! దాన్ని దేహము అనరాదు! అనుభవయోగ్యమైన ఒకానొక కోశము! ఈ మహాభావకోశము మనం తెచ్చుకోలేము, సాధన చేసి ఏడవడమే! కృప లభిస్తేనే వస్తుంది! అనేకజన్మల వల్ల సహజంగా లభించాలి లేదా తీవ్రమైన సాధన చేయాలి, అప్పుడే ఎప్పుడైనా లభించవచ్చు!
ప్రశ్న వేయకుండా లీలని ఆస్వాదించగలిగే నిష్కల్మష, నిష్కపటమైన తర్కాతీతమైన హృదయం శుద్ధభక్తి! అది ఉంటే మహాభావకోశము అర్థమవుతుంది!

ఆ మహాభావకోశము సగుణము కాదు నిర్గుణమూ కాదు! అత్యంత ఉత్కృష్టమైనది! ఆ మహాభావకోశము బృందావనం తప్ప ఇంకెక్కడా దొరకదు! మహాభావస్వరూపిణి అయినటువంటి రాధికాదేవి ఇస్తుంది! ఈ మహాభావశరీరంతోనే గోపికలు రాసలీలాప్రవేశం చేసారు! అందుచేతనే ఆ గోపికల ఇళ్లల్లో వారికి వారి వారి స్థూల దేహాలు అక్కడే కనపడుతున్నాయి! అంటే వాళ్ళు రసానుభూతి పొందినది మహాభావశరీరాలతో! మహాభావకోశములో లభించేదాన్ని శుద్ధసత్త్వ దేహం అంటారు! అది అనుభూతిని పొందుతుంది! క్రమంగా అది కోశాతీతమైన నామరూపాతీత స్థితికి తీసుకువెళుతుంది!

ఒకప్పుడు భగవాన్ దాస్ జి మీద ఒక విషప్రయోగం జరిగిందిట పదవి కోసం! పాదరసాన్ని నీటిలో కలిపి తాగించారు! ఆయన శరీరంలో కలుగుతున్న మార్పుల వల్ల బాధ కలిగి రాధే రాధే రాధే అన్నారు! అది అనుభూతిలో నుండి కదా అన్నారు! ఒక్కసారిగా ఆయనకి వాంతి జరిగి స్వస్థుడయ్యాడు! విషప్రయోగం చేసినవాడు మూర్ఛితుడయ్యాడు! అందరూ మరలా రాధే నామం చేయగానే ఆ మూర్ఛితుడయినవాడు కోలుకున్నాడు!

భగవాన్ దాస్ జి పరంపర నేటికీ తటియాస్థల్ లో ఇప్పటికీ కొనసాగుతుంది!

ఆ యోగులు ఒక్కొక్కరూ కూడా 100 కి పైగా ఏళ్ళు జీవించారు! వారు రోజుకి మొత్తం తింటే రెండు రొట్టెలు! అది కూడా లేకుండా యమునానది నీటితో బ్రతికేవారు కూడా ఉన్నారు! దేనివల్ల బ్రతికాడు అంటే తపస్సు వల్ల! పోయేటప్పుడు సునాయాసంగా రాధే రాధే అంటూ పోతారు! వారి యోగం ఎలాంటి శక్తి ఇస్తున్నదో గమనించాలి!

*ప్రధాన అంశము:*

*1) భావనని శుద్ధం చేసుకోవాలి! ఎలా?*

*2) గురుశిక్షణలో అయిదు నిష్ఠలతో కూడి వైరాగ్య, త్యాగ, ప్రేమలు తెచ్చుకుంటూ భావనని శుద్ధం చేసుకోవాలి! నిరంతర బృందావన వాసం వల్ల, సత్సంగం వల్ల, నామస్మరణ వల్ల, నిత్యచింతన వల్ల శుద్ధమైన భావం ఏర్పడి రాధాదేవి అనుగ్రహానికి క్రమంగా పాత్రం అయి, నిరాకారంగా తిరిగే హ్లాదినీ శక్తి దివ్యమంగళ శక్తిగా కనపడవచ్చు, రాధాకృష్ణయుగళ దర్శనం కూడా జరగవచ్చు!*

## సర్వము శ్రీగురుచరణారవిందార్పణమస్తు